పగడము

యలమంచిలి శ్రీరాములుగారు

౧

సుమారుగా ఈకథ జరిగి మూడువందల యేండ్లయింది. కృష్ణాజిల్లాలోనితిరువూరు తాలూకాలో ఒకభాగము సాంద్రారణ్యముగ ఉండేది. ఆయడవినిండ చిన్నచిన్న గుట్టలు కూడ చాలా ఉండేవి. ఏమాత్రము కూడ మానవసంచార ముండేది కాదు. సింహ శార్దూలాది క్రూరమృగాలు వీరవిహారము చేస్తుండేవి.

సాహసముగల దొమ్మరులు కొందఱు గుడిసెలు వేసికొని ఆఅడవిలో ఒకచోట నివ సించేవాళ్లు. వాళ్ల నాయకుని పేరు వరహాలు. వాళ్లవృత్తి దొమ్మరిఆట. వాళ్లు సంవత్సరాని కెనిమిది నెలలు దేశదేశాలు తిరుగుతూ ఆటఆడి డబ్బు సంపాదించుకొని వానకాలము వచ్చేసరికి ఆఅడవికి చేరుకొనేవాళ్లు.

పొట్టకోసమై దేశసంచారార్థము బయలు దేరిపోవుచున్నప్పుడు కృష్ణానదీతీరమున ఉన్న హేమాంబరపురములో పెత్తనదారు చౌద రయ్యగారి కుమార్తె — సంవత్సరమున్నర యీడు గలది — వాకిట్లో ఆడుకొనుచుండగా ఎత్తుకొనిపాఱిపోయినారు. ఆచీకటిలో విద్యుల్లత వలె ఆపిల్ల మెరయుచుండెను. అంత ముచ్చ ఠైనబిడ్డను వాళ్లజన్మలో ఏదేశాన చూచి ఉండలేదు.

ఆ పిల్లకు పంజరములోని పక్షి లాగ ఆటలు, పాటలు, నాట్యము బాగా నేర్పినారు. పదునాఱేండ్ల ప్రాయము వచ్చేసరికి ఆపిల్ల దొమ్మరిఆటలో మంచి ప్రావీణ్యము సంపా దించినది. ఆమె సౌందర్యము ఫణిఫణారత్న ములవలె చూపరుల నాకర్షిస్తున్నది. తుమ్మెద రెక్కలవంటి కురులు పాదాలు కప్పుతూఆమె నడిచేటప్పుడు వింతసోయగాన్నిస్తున్నవి. పద హారోవన్నె బంగారములాగ తనూలత మిన మినలాడుతున్నది. దీప్తులొలికే ఆమె కళ్లు సం ధ్యాతారకలవలె ముద్దు లొలుకుతున్నాయి. ఆమె సోయగమునకు తగిన పేరనియే వర హాలు ఆమెను పగడ మన్నాడు.

ఈమధ్య కొన్ని యేండ్లుగా చిత్తూరుజిల్లా మన ఆటగాండ్రు పోయియుండలేదు. వర్షాలు పూర్తిగా పోయినతర్వాత మన ఆటగాళ్లు సామానులు గార్దభములమీద కట్టుకొని కథలు, కబుర్లు చెప్పుకుంటూ దేశసంచా రము బయలుదేఱి మధ్యమధ్య మకాములు పెట్టుచు రెండునెలలలో చిత్తూరుజిల్లాలోని మహేశ్వరపురము చేరినారు. పగడమునకు లచ్చి అన్న చాలప్రాణము. లచ్చికి ప్రకృతి చిత్రాలను గుఱించి యేమేమో పగడము దారిలో నూరిపోయుచుండెడిది. దొమ్మరిలచ్చికి అవి బోధపడుతవా?

మహేశ్వరపురములో మాణిక్యాలు నాయుడనే కమ్మయువకుడు గొప్ప షాహుకారు. ఆయూరికే గాక ఆప్రాంతాలకు ఆతడు ప్రభువుగా చూడబడుచుండేవాడు. మాణిక్యాలు దగ్గఱకు స్నేహితు డొకడు వచ్చి, "ఈ మధ్యను ఎప్పుడూ రాని దొమ్మరిముటా ఒకటి వచ్చింది. మిమ్ముల నడిగి ఆట ఆడవలె నను కొంటున్నారు. వాళ్లతో నవయౌవనవతి యొకతె ఉన్నది. ఆమె సుందరవదనము అనదృశమనోహరమై నాకన్నుల కద్దిన ట్లున్నది. అట్టి లావణ్యవతిని మన మెవ్వరము కూడ ఎక్కడ చూచియుండము" అన్నాడు. ఆటకై ఆతురత హెచ్చింది మాణిక్యాలుకు.

వరహాలు తన బలగముతో ఆటఆడడానికి షాహుకారుగారి ఆవరణలో ప్రవేశించినాడు. డోళ్ల మోత విని ఊరి నాలుగుమూలల నుంచి పిల్లా జల్లా అంతా గుమిగూడినారు. పెద్దలు దొమ్మరివాళ్ల చుట్టు కూర్చున్నారు. పిల్లలు ఆవరణములోని వృక్షాగ్రముల కెక్కినారు. షాహుకారు ఒకవైపున చాపమీద కూర్చుండి వింతగానలువైపుల చూస్తున్నాడు. దొమ్మరియువతి రంగముమీదికి వచ్చి వెదురు కఱ్ఱమీదకు ఎక్కేటప్పుడు తదేక దృష్టితో ఆమెకేసి చూడ నారంభించినాడు. ఆమె కఱ్ఱ కొనకు బోయి అక్కడ అత్యద్భుతమైన తన విద్యను ప్రదర్శించేటప్పుడు "అంతయెత్తునుండి ఆయువతి పడి చచ్చిపోతుందేమో" అని అన్నాడు బిగ్గఱగా.

ఆమె ఆ వెదురుకఱ్ఱ తుదను కూర్చుండి చేతులతో కఱ్ఱమీద తాళము వేస్తూ పాట నాలాపము చేసేటప్పుడు, ఆపె కంకణ కింకిణీ రవములు శ్రుతి కలుపుతూ మనోహరధ్వనుల నొసంగి చూపరులకు తన్మయత్వము కలిగించినవి! "నేను నానేర్చినవిద్యను ప్రదర్శించినాను; షాహుకారుగారిని గొప్ప బహుమతి నివ్వమని వేడుకొంటున్నాను" అని ఆ ఉన్నతస్థానమున నుండి చిర్నగవుతో బిగ్గఱగ చెప్పి, తనలో "ఈ యన హృదయాన్ని జయింపగల్గితే........" అనుకొన్నద. ఆ షాహుకారు తక్షణము ఇన్నూరు రూపాయల వెలగల చీరెను తెప్పించి యిచ్చినాడు.

ఆట ముగిసిన వెనుక షాహుకారుగారిని ఆఊరులో స్థిరనివాసము చేయటానికి వసతి నీయమన్నాడు ముటానాయకుడు. 'అట్లే' అన్నాడు షాహుకారు. సుందర భవనము నొకదాని నిచ్చినాడు; దగ్గఱలోనే కుటీరాలు నిర్మించుకొనినారు మిగిలినవాళ్లు.

పగడము ఆ యింటిలో ప్రవేశించినకొన్ని దినాలకే చిక్కిపోనారంభించినది. ఆ యింటి యావరణలో ఫలపుష్ప వృక్షములను,లతలను పాతినారు.మల్లెలు మొల్లలు పూస్తున్నవి;కాయగూరలు కాస్తున్నవి ఆవరణగా వేసిన కంచె పెరగనందున పశువులు వచ్చి మేసిపోకుండా పగడము చాల జాగ్రత్త తీసికొంటున్నది. అన్నము సహించుట లేదంటూ తఱచు ఆటకు వెళ్లటము మానివేసియింటివద్దనే ఉండి గొడ్డు

గోద దొడ్లోకి వచ్చి తినిపోకుండా చూచుచున్నది. ఆమె జబ్బుగా ఉన్నదని మంచి కూరలు, తినుబండారాలు తెచ్చి యిస్తున్నాడు వరహాలు. ఆబిడను సంతోషపెట్టడానికి కాళ్లకు బేడీలు, నెత్తికి చంద్రవంక చేయిస్తానన్నాడు. ఇట్టివా ఆబిడను సంతోషపెట్టునవి?

౨

"నీళ్ల రేవునకు నిత్యము సాయంకాలము నీవేల ఒంటరిగ పోతున్నావు? నిద్రపోకుండా విచారపడుతూ కళ్ల వెంట నీళ్లు కారుస్తున్నావు? నిట్టూర్పులు పుచ్చును నాయుడుగారి యింటికేసి తఱచు చూస్తుంటా వేల? నీవు నాయుడుగారి హృదయాన్ని ఆకర్షించినావని వదంతిగా ఉన్నది. ఎంతవఱకు నిజమో? తెలిసినంతవఱకు దాపరికము లేకుండ నాకు చెప్పు. నే నెక్కడ పొక్కనీయనులే" అన్నది చెలికత్తెతో లచ్చి.

"నాహృదయాన్ని నేనెట్లా శాంతింపజేసికోగల్గుతానో బోధపడకున్నది. శక్తికొలది ప్రయత్నించినా, మనోగమనాన్ని అడ్డుకోలేక పోయినాను. మనస్సెపుడు........"

"మనస్సు గట్టిపఱచుకో. వారమురోజులు యిల్లు బయలు దేరబోకు. నాయుడుగారు అడిగితే 'మా దేశము పంపివేసినారు' అని చెప్పుతాను."

"నేను ఒక్కరోజు అతనిని చూడకపోతే నాచావుకు వేరే కారణ మక్కరలేదు. ఆయుష కుడు నాహృదయాధినాథుడు. దొమ్మరివాళ్లు ఎక్కడకు బోతే అక్కడకు నా బొందిని తీసికొని పోతారు గాని హృదయాన్ని తీసికొని పోలేరు."

వరహాలుకు తమ ప్రేమసంవర్ధనము గిట్టినది కాదని పగడము, నాయుడు గ్రహించినారు. అందువలన వారి కేవిధముగా అడ్డుపడతాడో అని వారు భయపడుతున్నారు. అట్టిస్థితిలో వసంతుడు పుష్పరథాన్ని యెక్కి తర్లి వచ్చినాడు. ఆమ్రపల్లవములు మెక్కి మత్తెక్కి గండుకోయిలలు కుహూరావములు చేస్తున్నవి. నాయుడుగారు నడురేయి నిద్రమేలకువ రాగా ఏటిరేవునకు వచ్చి తన వేణునాదముతో హెచ్చరించినాడు. పగడము చెవిలో అమృతం వర్షించినట్టే! వెంటనే బయలుదేఱి అతని దగ్గరకు పోయి, ఆమెను చూడకుండా ఆవేశముతో పాడుతున్న ఆతనిని కౌగలించుకొన్నది పుష్పదామము వలె.

"తల్లిని, దేశాన్ని, నాసర్వస్వాన్ని విడిచిపెట్టి నీకోస మెంతదూరమైన వచ్చివేయటానికి సిద్ధముగ ఉన్నా"నన్నాడు నాయుడు.

"పంజరములోని పక్షిలాగ స్వేచ్ఛలేనిదానను. నీవే గనుక పూమొగ్గవై ఉంటే నా కొప్పులో బంధించి దాచుకొని యుండేదానిని. ఏమిలాభము నాకోసము ఆశపెట్టుకొని కష్టాలపాలుకాబోకు" అన్నది పగడము. కర్కశముగా ఉన్న యీమాటలన్నీ చాటుగా ఉండి వరహాలు విన్నాడు.

3

"ఒకటి రెండురోజులలో ఊరువిడిచి లేచి పోతున్నాము. ఇక మనము ఒకరినొకరు చూచుకునే భాగ్యం లేదు కాబోలు! ఎంతకఠోర విషయము! నిన్ను చూడకుండా నే నెట్లా బ్రతుకుతాను! నే నేమి చేయగలను! స్వేచ్ఛ యేది నాకు! అబలను" అని తన నివాసస్థానానికి మార్గంమాత్రము చెప్పినది.

మూట ముల్లె కట్టుకొని అర్ధరాత్రివేళ దొమ్మరవాళ్లు లేచిపోయినారని భోజనము చేస్తున్న నాయుడు విన్నంతనే యెత్తిన ముద్ద క్రిందకు విడిచి అన్నమువద్దనుంచి లేచినాడు.

"ఉద్యానవనములో ఏకాంతముగ కూర్చొండి తంతువులే కుండ నాకై పుష్పమాలను గుచ్చుతుండేది! దినాలు గతించినవి; మాసాలు మర్లిపోయినవి. మళ్ల కలసికునే అదృష్ట మబ్బినది కాదూ"అనుకొన్నాడు నాయుడుగారు. అర్ధరాత్రివేళ వెంటనే బంధువులను, సర్వసౌఖ్యములను, ధనధాన్యములను విడిచివేసి బయలు దేరినాడు దొమ్మరిపిల్ల కోసము. త్రోవలో ఉన్న తిరుపతి వేంకటేశ్వరస్వామివారి దర్శనమన్నా చేసికొనకుండా కనబడినవారి నల్లా దొమ్మరిఆటగాళ్ల జాడ నడుగుతూ వస్తుండగా, "రెండువారాలక్రిందట మా ఊరులో ఆడిపోయినా"రని గొల్లపల్లెలో గొడ్లకాపరులు చెప్పినారు. ఆమాటతో అతని అంతరంగాన్నుంచి ఆనందతరంగాలు వెల్లివిరిసినవి. ఉన్మత్తుడై గొడ్లకాపరుల కర్థమగునో కాదో అను విచారణమైన లేకుండ, "నక్షత్రాల్లాగ ప్రకాశించే నయనాలు, వినీలశారదాంబుదములను తిరస్కరించే కేశపాశము, అపరంజిముద్దవలె తళ్కులీనే తనూలత, కిన్నెరనాదాన్ని మరపించే రాగాలాపము గల పగడము గడకొనకు ఎక్కి ఆటఆడినది కాదూ" అంటాడు. ఊరులోపలికి పోయి పగడము వంటచేసిన ప్రదేశాన్ని తొక్కిచూచుకొన్నాడు. నీళ్లు తెచ్చినదార్లు కనుక్కొన్నాడు. జాడ తెలిసిన సంతోషము కంటె త్వరగా పోయి కలియవలెననే ఆతురత హెచ్చినది.

చింతచే పగడము యొక్క యౌవన పుష్పము వాడి వత్తలై పోయినది. సుష్ఠుగా తిండి తినటముగాని, సంతోషంగా కబుర్లు చెప్పటము గాని, తన విద్యానైపుణ్యాన్ని ప్రదర్శించి మెప్పుపొందాలనే కాంక్షనుగాని చాలాదినాల క్రిందటనే మాసివేసింది. తలనొప్పిఅని, యేమీ తోచటములేదని తనలో తాను కుళ్లిపోతుండటముతప్ప, చీపురుకూడా చేత పట్టడము మాని వేసింది.

నేడు తలనొప్పిమటుమాయమయింది అనుకుంటాను. ముఖములో ఆనందము తొణుకుతున్నది; సంభాషణలో తేనె ఒలుకుతున్నది, చైతన్యము వచ్చింది. స్వయముగ నీళ్లు తెచ్చి వండి విందారగింపజేసినది. నిష్కళంక ప్రేమ ముందు కులము నెవరు గణిస్తారు? ఏల గణించాలి? అతని హృదయానికి ఆ విషయమే తట్టిందికాదు. సంతృప్తిగా భోజనము చేసినాడు మాణిక్యాలనాయుడు.

నాడు అమావాస్య. గాఢాంధకారము. దానికి తోడు కారుమేఘాలు కప్పినవి. అతిథి గుడిసెలకు కొంచెము దూరములో నదీ సైకత స్థలిని వటవృక్షము క్రింద శయనించినాడు. పగడము ప్రియుని గుఱించిన యేవో ఆలోచనలలో మునిగిఉన్నది. అట్టిస్థితిలో ప్రొద్దుపోయి ఆట నుండి తిరిగివచ్చిన వరహాలునకు అతిథి రాకను గుఱించి చెప్పినారు. అతిథిని ఆబిడచేతనే చంపించుట శ్రేయస్కర మనుకొనినాడు. వెంటనే నిప్పులు గ్రక్కుకుంటూ ఆతడు పగడమువద్దకు వచ్చేసరికి ఆబిడ అదరిపోయింది. ప్రియుని చంపి పారవేయవలసిన దని నిర్బంధించినాడు, భయపెట్టినాడు, పదనైన ఖడ్గాన్ని యిచ్చినాడు బలవంతముగ.

తుమ్మెద రెక్కలవంటి దీర్ఘకుంతలాలు పాదాలమీద జీరాడుతున్నాయి. సంతత బాష్పధారలు చెక్కిళ్లమీదనుంచి వక్షఃస్థలముమీదికి జారుతున్నాయి. అట్లాగే పడుతూ లేస్తూ ఆయువకుని శయ్యామీదకు వెళ్లి కూర్చుండి, "ఇంకా నిద్రయేనా? అబ్బ! నాతండ్రి... కర్కశహృదయుడు — నిర్దయుడు — కృతఘ్నుడు — మూర్ఖుడు......నిన్ను, నా ప్రాణాధికుడవగు నిన్ను చంపవలెనట! నేనట్టి ఘాతుక కృత్యాన్ని చేస్తానని యెట్లా అనుకోవాలి! నేనట్టి రాకాసినా! జీవము పోసి పెంచుకొన్న ఆశాంకురాన్ని యెట్లా పెరికివేస్తాను? పెరికి నేనెట్లా బ్రతుకుతాను? నాజన్మ యింకేల! చంపకపోతే నన్ను తుత్తునియలు చేస్తాడట! ఆతని చేత నేను తుత్తునియ లేల చేయించుకొనవలెను? నీకగ్గఱ నన్ను నేనే చంపుకోవాలని వచ్చినాను" అని ఆత్మహత్య కుద్యుక్తురాలగుచుండగా మాణిక్యాలు మేల్కొని వారించినాడు "నాతండ్రివంటివాని బారినుండి బ్రతుకుట దుర్లభము నీవు నీదేశము పోయి సౌఖ్యముగ నుండుము. నన్ను చంపుకుంటే యీ చిక్కు తీరుతుంది" అన్నది.

నీకోసరము నా దేశాన్ని కులాన్ని సమస్తమూ విసర్జించి యిక్కడకు వచ్చినాను. నీవు వనపుష్పానివి: నీచేత ఆకర్షింపబడ్డ మధుపాన్ని నేను. నీకోసమై యిన్ని దినాలు తిరిగినాను. ఏమి పోయినను నా ప్రేమ నిధానమవు నీవు దొరికినావుగదా అనే సంతృప్తి చెందినాను. నిన్ను విడిచి నే నెట్లా బ్రతుకుతాను? నవయౌవనపుష్పాన్ని సౌందర్యోపాసకుడనైన నా కర్పించినందుకు కొండ యెక్కినాను..."

ఆదంపతులు రెండు మంచి గుఱ్ఱాలను ఎక్కినారు. వాయువేగముతో పోయి పోయి భద్రాచలమునకు సమీపములో ఒకసాంద్రారణ్యములో ఆగిపోయినారు. సమస్తము మరచిపోయినారు; పుష్పసౌరభాలు వెదజల్లే వృక్షచ్ఛాయల పరుండి, వనఫలాలు తింటూ, సెలయేటి నీరముల గ్రోలుతూ, పుట్టతేనియల జుఱ్ఱుతూ, బ్రహ్మానందముతో ఆఅడవిలో సంవత్సరము ఒకరోజుగా గడుపుతున్నారు.

ఒకనాటి సాయంకాలమున ఆదంపతులు సెలయేటియొడ్డున ఒకస్ఫటికపుశిలపై కూర్చుండి విజ్జోడై వాపోవుచున్న కపోతికేసి చూస్తున్నా

రు. దగ్గఱలోనే చెంచుపిల్లలు శాద్వలములలో ఆవుల మేపుతున్నారు. చెంచుపిల్లవాడొకడు వచ్చి, "వరహాలు మటా అట, దొమ్మరాట బాగా ఆడతారట, ఆమడదూరములో నున్న చెంచుగూడెములో ఆడుతున్నారు. చూడడానికి వచ్చేవారెవరన్నా ఉన్నారా" అని అడిగినాడు. వాయు కంపితమైన లతవలె పగడము ప్రియుని హస్తములలో వరిగింది.

"దాహ మవుతున్నదా? నీళ్లు తెచ్చేదా?" అన్నాడు.

"ఇంకా దాహ మేమిటి? ఒకప్రక్కనుండి మన సౌఖ్యసామ్రాజ్యానికి అంత్య సమయము తరుముకొని వస్తున్నది. ఇదియే తుదిరోజు. వరహాలు వస్తున్నాడు మనను చంపుటకై. భయంకరమృత్యు గహ్వరానికి ఎర అవుటకు సిద్ధంగా ఉండాలి" అన్నది. ఆతడును విచారసముద్రమున మునిగిపోయినాడు.

"నామనోనాథుని చంపి యెట్లా యింటికి రాగల్గుతాను? అతడు నీ కేమి అపకారము చేసినాడు? మాది నిష్కళంక ప్రేమ! మా ప్రేమముందు మానవనిర్మితాలైన సాంఘిక బంధనములు నిలువలేకపోయినవి!! భానుబింబమువలె ప్రకాశిస్తున్న నాప్రియుని, నాపెన్నిధిని ఎట్లా చంపేది? పెంచిన ప్రేమచేతనన్నా నా స్వాతంత్ర్యరథాన్ని గొలుసులచేత కట్టబోకుము! కృతజ్ఞులమై ఉంటాము. ఏమందువు? వేఱొక దొమ్మరివానిని పెండ్లి చేసికొనవలెననియా? ప్రేమ ఒకరికి అర్పించిన తర్వాత తిరిగి రాదు! నాహృదయాన్ని ఆయనకర్పించినాను. ఈహృదయములో మరొకరికి స్థానము లేదు. నిజమైన ప్రేమ జన్మలో ఒక్కరికే అర్పించుట; అందులకు భిన్నమైనది కామలాలసత్వము—నాకళ్లతో నా ప్రియుని నీవు చూస్తే ఆతని ప్రతిబింబముచేత నీ కన్నులు నిండిపోతవి" అన్నది దీనంగా.

"పసిబిడ్డను తెచ్చి పెంచి పెద్దదానను చేసినాను. చిన్నప్పటినుంచి ఆమె ముద్దుమాటల కెంతో ముచ్చటపడుతూ ఆమె ఆనందమే నా ఆనందముగ భావించి యుక్తవయస్కురాలై బిడ్డస్వాతంత్ర్యాన్ని అనుభవించేటప్పుడు అడ్డుకొని, దయ మాలి ప్రేమభావము నెఱుగక ఆదంపతుల ప్రాణాలు తీయించినాను. ఆ నిష్కళంక ప్రేమబలముచేతను కాదా ఆయువకుడు తన సర్వస్వమును విడిచి వచ్చి యిన్ని యిక్కట్టులపాల్పడెను" అని చింతించినాడు. ఆ దంపతులసమాధిని వనపుష్పాలతో కప్పివేసి కన్నీటిధారలతో కడిగినాడు. ఒక్కొకసారి మతి వోయి, "యింకెంతకాల మీా సమాధిలో ఉంటావు! నీస్వేచ్ఛను అడ్డగింపను లెమ్మిక. నేను వనపుష్పాలు ఏరి తెస్తాను. నీ ప్రియునికి దండ గ్రుచ్చు" అంటాడు వరహాలు !!!